క్లుప్తంగా

కార్మికులకు వైద్య శిబిరం



వైద్య శిబిరంలో కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గంగాధర నెల్లూరు: మండలంలోని జైన్ కర్మాగారం వ్యవస్థాపకులు డాక్టర్ పద్మభూషణ్ బవర్ లాల్ జైన్ 87వ జయంతి పురస్కరించుకుని కర్మాగారంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. విన్ హాస్పిటల్ (చిత్తూరు) వైద్యులు, సిబ్బంది కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తొలుత జైన్ కంపెనీ మేనేజర్ షమీర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించి బవర్‌లాల్ జైన్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన మనుమడు అత్మన్ జైన్ మాట్లాడారు. రైతులు, కార్మికుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ అశోక్, విశ్వకర్మ, మంగేష్, బావతే, కర్మాగార సిబ్బంది పాల్గొన్నారు.

16న ఉపకరణాల నమోదుకు శిబిరం

గంగాధర నెల్లూరు: భారత ప్రభుత్వ సంస్థ అలింకో, వికలాంగుల సంక్షేమ సంస్థ(చిత్తూరు) ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపకరణాల నమోదు గుర్తింపు శిబిరం ఈ నెల 18న ఎస్ఆర్ పురం మండల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్టు జీడీ నెల్లూరు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ శిబిరానికి జీడీ నెల్లూరు మండలంలోని విభిన్న ప్రతిభావంతులు 2 సెట్ల ధృవీకరణ పత్రాలను తీసుకురావాలని, అందులో విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల దరఖాస్తుకు వికలత్వ ఫొటోలు- 4, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడి కార్డు/రశీదు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాలు, వయో వృద్ధుల ఉపకరణాలకు ఫొటోలు: 4, ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకుని సమీపంలోని శిబిరాలకు హాజరై నమోదు చేసుకోవాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



అప్రమత్తంగా ఉండాలని వృద్ధురాలికి చెబుతున్న ఎంపీడీఓ

గంగాధర నెల్లూరు: మండలంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. వాగులు, వంకలు, కాజ్‌వేలను ఎవరూ దాటరాదని, అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులెదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

దగా పడిన రైతులకు అండగా నిలబడదాం రండి

వెదురుకుప్పం: కూటమి పాలనలో అన్ని విధాలా దగా పడుతున్న రైతాంగానికి అండగా నిలిచి కలెక్టరేట్ ముట్టడితో కనువిప్పు కలిగేలా పెద్ద ఎత్తున ఆందోళనకు అందరూ తరలిరావాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పద్మనాభరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడికి రైతులు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

రెవెన్యూ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

పాలసముద్రం: మండలంలోని నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అరుణ కుమారి కోరారు. గురువారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయంలో సర్పంచ్ లిల్లీ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు తమ భూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఇస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు ఇన్‌చార్జ్ కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర మునిసిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న నరసింహ ప్రసాద్ వ్యక్తిగత పనులపై గురువారం నుంచి 15 రోజుల పాటు సెలవు పెట్టారు. దీంతో కార్పొరేషన్‌లో మునిసిపల్ ఇంజినీరుగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డిని అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎడతెరపిలేని వర్షం..

- కుశస్థలిలో పెరిగిన నీటి ప్రవాహం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పంట పొలాల్లోకి చేరిన వర్షపు నీరు
- ఇళ్లకే పరిమితమైన జనం

నగరి : తుపాను ప్రభావంతో గురువారం వేకువజాము నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తూ ఉండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువల ద్వారా చెరువులకు నీరు చేరుతోంది. కుశస్థలి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. కీళపట్టు మార్గంలోని లోతట్టు వంతెనపై నుంచి నదినీరు పారింది. దీంతో అత్యవసరాల నిమిత్తం ఇంటినుంచి వెళ్లేవారు ఆ నీటిలోనే నడచుకుంటూ ఇటువైపుకు రావాల్సివచ్చింది. లోతట్టు ప్రాంతాలైన నగరిపేట, టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ నివాసాల వద్ద, వినాయకనగర్, సాయినగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు వీధుల్లో ప్రవహించింది. నగరిలో గురువారం సాయంత్రం వరకు 52.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వరి, వేరుశెనగ, మొక్కజొన్న, మినుము, పెసర పంట భూముల్లో వర్షపు నీరు చేరింది. పలు ప్రాంతాల్లో నివాసాల చుట్టూ వర్షపు నీరు గుంటలా చేరింది. జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు సమీపంలోని గుంత వర్షానికి నిండి పైకి పారడంతో బాలుర, బాలికల హాస్టల్ ప్రహరీ వరకు జలమయమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లే మార్గమంతా జలమయమైంది. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో బయటకు రాలేక జనం ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లపై జనసంచారం తగ్గింది.



పుత్తూరు: జలమయమైన కాలనీ, భవానీనగర్ ఉప్పుకాల్వ వద్ద వరద ఉధృతి

పంటను ఇలా కాపాడుకోవచ్చు

వర్షాలకు తడిచిన పంటలను కాపాడుకునే మార్గాలపై వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు అందించారు. కోత దశలో ఉన్న వరి గాలులకు పడిపోతే 4, 5 వరి దుబ్బులను ఒక దగ్గరకు చేర్చి కట్టగా కట్టాలని చెప్పారు. అధికంగా ఉన్న నీరు తీసివేసి కంకులపై ఒక లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. అలా చేస్తే తడిసిన గింజల నాణ్యత తగ్గకుండా ఉంటుందని పేర్కొన్నారు. దుబ్బు దశలో ఉన్న వరి పంటలలో అధికంగా ఉన్న నీరు తీసివేసి ఎకరాకు అర బస్తా యూరియా 15 కిలోల పొటాష్ ఎరువు వేయాలని చెప్పారు. మిగిలిన పంటలలో కూడా వెనువెంటనే నీరు తీసివేసి భూములు ఆరబెట్టుకుంటే, పంటలను కాపాడుకునే అవకాశం ఉందని చెప్పారు. ఆ తరువాత డీఎం–45 మందును 3 గ్రాములు లీటరు నీటికి కలిపి ముందు జాగ్రత్తగా పిచికారీ చేసుకోవాలని సూచించారు.

పుత్తూరులో 95.2 మి.మీ. వర్షం

పుత్తూరు: వాతావరణ మార్పు ప్రభావంతో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పుత్తూరులో 95.2 మి.మీ. వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ 4వ వార్డులో ఇక్కడి ఉప్పుకాల్వ పొంగుతుండడంతో రాకపోకలు స్తంభించాయి. భవానీనగర్ కింద భాగంలో ఉన్న 6వ వార్డుకు చెందిన తాయిమాంబాపురం గ్రామం చెరువు నిండి కలుజు పారుతోంది. నేసనూరు కాజ్‌వేపై ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇక్కడ కూడా రాకపోకలు స్తంభించాయి. తడుకు పంచాయతీ వేణుగోపాలపురం శ్మశాన వాటిక వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పట్టణంలోని పలు కాలనీల్లో వర్షపు నిలిచిపోయింది. పట్టణంలోని ఎంబీరోడ్డు, రాచపాళెం రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



విజయపురం: నేలకొరిగిన వరి పంట

జాగ్రత్తలు పాటించాలి

వాతావరణ మార్పులతో వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలువురు ఫ్లూ జ్వరాలు, జలుబుతో బాధపడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రజలు మరింతగా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి సులభంగా బయటపడవచ్చన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఆహారం తీసుకొనే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. జ్వరం మూడు రోజులుగా ఉంటే టైఫాయిడ్, డెంగీ జ్వరానికి సంబంధించిన పరీక్షలు చేయించి, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలని సూచించారు.

దెబ్బతిన్న పంటలు

పాలసముద్రం : మండలంలో కురిసిన వర్షాలకు రైతులు పంటలు నష్టపోయారు. గురువారం ఉదయం నుంచి సాయంత్ర వరకు వర్షం నిరవధికంగా పడింది. ఆముదాల, బాలక్రిష్టాపురంలో వరి పంటలు నీటమునిగాయి. వంకలు ప్రవహిస్తున్నాయి. పంటలు చేతికందే సమయంలో వర్షాలకు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



పాలసముద్రం: వర్షానికి దెబ్బతిన్న వరి పంట



కొబ్బరి తోటలో నిలిచిన నీరు,



నగరి: ఏకాంబరకుప్పం వద్ద జలమయమైన రైల్వే అండర్ బ్రిడ్జి, రోడ్డుపై ప్రవహిస్తున్న కుశస్థలి నదీ ప్రవాహం

పొంగుతున్న వాగులు

వెదురుకుప్పం: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగాఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి వర్షం పడుతుండడంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. కసవనూరు, దిగువగెరిగదొన చెరువులు నిండి మొరవ పారుతున్నాయి. గుండుపల్లె చెరువు, మద్దెమానుమడుగు ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయ. టీకేఎం పురం చెంజివెంకటరెడ్డి చెరువు నిండింది. వర్షాల ధాటికి జనజీవితం స్తంభించింది. పనులకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమయ్యారు. ఆళ్లమడుగు సమీపంలో విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుపై పడింది. గ్రామీణ రోడ్లు, వీధులు బురదమయమయ్యాయి. మారేపల్లె సమీపంలో ఉన్న మద్దెల వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.



శ్రీరంగరాజపురం: రోడ్డుపై ప్రవహిస్తున్న వాగు

ఉధృతంగా ప్రవాహాలు

శ్రీరంగరాజపురం: మండలంలోని పాపిరెడ్డిపల్లె, పాతపాలెం, జీఎంఆర్‌పురం, దిగువ కమ్మకండ్రిగ, ఎగువ కమ్మకండ్రిగ, వాగుల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్లపై నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దాదాపు 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వాగుల వద్ద ముందస్తు అప్రమత్తత చర్యలు తీసుకోవాల్సి ఉంది.



వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో కురుస్తున్న వర్షం



వెదురుకుప్పం: నిండిన కసవనూరు చెరువు

మొరవపోతున్న చెరువులు

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట, విజయపురం మండలాల్లో బుధవారం రాత్రి 8 గంటల నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. వరి, వేరుశనగ పంటలు నీట మునిగాయి. విజయపురం మండలంలో మొత్తం 40 చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. వడమాలపేట మండలం పాదిరేడు, వడమాల, ఒబియర్‌కండ్రిగ, పాపారాజుకండ్రిగ రాకపోకలు స్తంభించింది. వడమాలపేట మండలంలో 116.4 మి.మీ. విజయపురంలో 40.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



విజయపురం : కలుజు పారుతున్న పాతర్కాడు చెరువు



వడమాలపేట కాజ్ వేపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ముట్టడిని విజయవంతం చేద్దాం

పాలసముద్రం : పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగం వ్యతిరేకిగా నడచుకుంటోందని విమర్శించారు. కలెక్టరేట్ ముట్టడికి మండలంలోని ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ, సర్పంచ్లు, అన్ని పంచాయతీలు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రూరల్ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ గురువారం ప్రారంభించారు. ఈ పూజ కార్యక్రమంలో ఈఈలు సురేష్, మునిచంద్ర, జగదీష్, డీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాకు ఎస్ఈ కార్యాలయం మంజూరు కావడంతో ఇదివరకు గిరింపేటలో ఉన్న రూరల్ డివిజన్ కార్యాలయంలోనే కలిసి పాలన సాగించారు. ఉద్యోగుల విధి నిర్వహణకు కార్యాలయం సరిపోకపోవడంతో పాత కలెక్టరేట్‌లో భవనాన్ని మంజూరు చేశారు. వాటిని రూ.7 లక్షలతో మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజన్ పరిధిలో జీడీ నెల్లూరు, నగరి నియోజకవర్గంలో నగరి టౌన్, నగరి రూరల్, పానూరు, నింద్ర సెక్షన్లు వస్తాయి.



రూరల్ డివిజన్ కార్యాలయం

కిశోర వికాసం.. సాధికారతకు పునాది



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల

ఐరాల: కిశోర వికాసం కార్యక్రమం ద్వారా బాలికల సాధికారత సాధ్యమవుతుందని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి నిర్మల అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఒక రోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కిశోర వికాసం కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు పరచడంతో వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల బాధ్యతలు వివరించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, విద్య ప్రాముఖ్యత, రుతుక్రమం, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, పోషకాహారం ప్రాముఖ్యత, మానవ విలువలు, యోగా, కరాటే యొక్క ప్రాముఖ్యత, పోక్సో చట్టం, బాలల చట్టాలను గ్రామస్థాయి అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. శిక్షణ పొందిన అధికారులు గ్రామ సచివాలయ పరిధిలో బడి బయట ఉన్న 11 నుంచి 18 ఏళ్లలోపు కిశోర బాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి ఆయా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి రెండో, నాలుగో శనివారం అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. మహిళా పోలీసులు కన్వీనర్‌గా బాధ్యత వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుదామని, బాలల హక్కుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా బాలికల సాధికారతకు కృషి చేస్తామని సీడీపీఓ నిర్మల ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ దామోదర్‌నాయుడు, పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత, ఎస్ఐ నరసింహులు, ఏఓ భువనేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, మండల సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉత్తరం.. ఓ మధుర జ్ఞాపకం!

- నేటి తరానికి ఉత్తరాన్ని పరిచయం చేస్తున్న తపాలా శాఖ
- 'ప్రియమైన నువ్వు... ఓ ఉత్తరం పంపు' అంటూ పోటీలు
- ప్రతిభ ఆధారంగా బహుమతులు
- ఈ నెల 14న తుది గడువు

నగరి : ఉత్తరం ఒక మధురమైన జ్ఞాపకాలకు సాధనం. ఉత్తరాలు మన ఆత్మీయుల యోగక్షేమాలకు ఆనవాళ్లు.. ప్రేమికుల్లో విరబూసిన పారిజాతాలు.. సరిహద్దులో శత్రువులతో పగలు రాత్రి పోరాడుతున్న సైనికుడు తన భార్య పంపే హృదయ నివేదనల కోసం ఎదురు చూసేందుకు ఎన్నో పడిగాపులు.. ఇలా మానవ సంబంధాలకు నిలయంగా మారిన ఉత్తరాలు ఇప్పుడు కనుమరుగయ్యాయి. సెల్‌ఫోన్లు, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లు, ఈ–మెయిల్ లాంటి అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో లేఖలు కనిపించకుండా పోయాయి. ఉద్యోగ, వ్యాపార, విద్య, ఆర్థిక ఏ కబురు ఎక్కడ నుంచి ఎక్కడికి, ఎవరికి పంపాలన్నా ఒక ఉత్తరం ముక్కే సాధనమై ఉండేది. మాటకు మూడక్షరాల ఉత్తరమే అయినా అది మోసుకొచ్చే విషయాలు.. భావాలు.. కబుర్లు ఎన్నెన్నో. అందులోని అంశాన్ని బట్టి అది చదువుకునే వారి భావోద్వేగాలు అదే స్థాయిలో ఉండేవి. ఆ భావోద్వేగాలకు కారణమైన ఆ ఉత్తరం పంపిన వారి ముఖ కవళికలు, భావాలు ఆ అక్షరరూపంలో మదిని పలకరించేవి. ఇదంతా గతం. వర్తమాన తరాలకు ఈ లేఖల మాధుర్యం తెలియదు. ఆ లేఖలు బాగా కుదించుకుపోయి ఇన్ని పదాలు.. ఇన్ని అక్షరాలు ఉండాలనే నిబంధనాల్లో చిక్కుకుపోయి ఎస్ఎంఎస్‌లు, ఈ మెయిళ్ల రూపంలో సంక్షిప్తమైపోయాయి. ఈ క్రమంలో ఉత్తరాలు రాసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కేవలం సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం నేటి ట్రెండ్. అందుకే ఉత్తరాన్ని గుర్తు చేద్దామని తపాలాశాఖ తలపెట్టింది. ×ప్రియమైన నువ్వు ఓ ఉత్తరం పంపు₹ అంటూ ప్రోత్సహిస్తూ ఏటా లేఖరులకు పోటీలు పెడుతోంది. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్గించడానికి తపాలాశాఖ అడుగులు వేస్తోంది.



నగరి తపాలా శాఖా కార్యాలయం

ఉత్తరాల పరిచయానికే ఈ పోటీలు

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గింది. ఒకప్పటి సమాచార సాధనాన్ని నేటి తరానికి మళ్లీ పరిచయం చేయడానికి తపాలాశాఖ లేఖా రచన పోటీలకు శ్రీకారం చుట్టింది. ది జాయ్ ఆఫ్ రైటింగ్ ఇంపార్టెంట్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ధాయ్ ఆఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

బహుమతులు

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి 3 స్థానాలు నిలిచిన వారికి (12 మందికి మించకుండా) నగదు బహుమతి అందజేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా 25 వేలు, 10 వేలు, ఐదువేలు ప్రధానం చేస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలను జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ స్థానానికి రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు అందజేస్తారు. భారత దేశ పౌరులై ఉండాలి. వయో పరిమితి లేదు. 18 ఏళ్ల లోపు ఒక కేటగిరి, 18 ఏళ్ల పైబడిన వారిని మరో కేటగిరీగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను పొందుపరచాలి. చేతితో రాసిన వ్యాసం మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్త రాలు దీ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ -520013 చిరునామాకు గానీ సమీపంలో తపాలా కార్యాలయాలకు డిసెంబర్ 14వ తేదీలోగా పంపాలి.